ప్రజాశక్తి
గురువారం 20 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

హాస్టల్లో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-పాచిపెంట

పి.కోనవలసలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం అపరిశుభ్రతగా ఉండటం పట్ల జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి.. ప్రిన్సిపల్‌పై మండిపడ్డారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం పి.కోనవలసలోని వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటగదిలో నెలకొన్న అపరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నివసించే ప్రాంతాలు, వంటశాల, మరుగుదొడ్లు, పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇకపై ఇటువంటి వాతావరణం కనిపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి తదితరులు పాల్గొన్నారు.

అక్కడ జైకొట్టి..
ఇక్కడ సన్నాయి నొక్కులు

- ప్రజాభిప్రాయం లేకుండా అనుమతి మంజూరు
- ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్టుకు మంత్రి మండలి ఆమోదం
- ప్రజల అభ్యంతరాలు గౌరవిస్తామంటూ మంత్రి ద్వంద్వ వైఖరి

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రశాంతంగా ఉన్న దుగ్గేరు ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో రాష్ట్ర ప్రభుత్వం అలజడి సృష్టించింది. ప్రజాభిప్రాయం తీసుకోకుండానే అనుమతి మంజూరు చేసింది. కొద్ది రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఏకపక్షంగా పవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. దీంతో ఈ ప్రాంత గిరిజనుల్లో ఆందోళన మొదలైంది. చిన్న, సన్నకారు గిరిజన రైతులుండే ఈ ప్రాంతంలో 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం వేలాది ఎకరాల భూములు సేకరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆందోళన చెందుతున్న గిరిజనులు, రైతులను మరింత మభ్యపెట్టేందుకు జిల్లా మంత్రి చూస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం పాచిపెంట మండలంలోని సరిహద్దు గ్రామాల్లోనూ భూసేకరణకు హద్దు రాళ్లు వేశారు. పాచిపెంట మండలంలో అనంతగిరి మండలం సరిహద్దు ప్రాంతంలోని గ్రామాల భూములు కోల్పోయే అవకాశం ఉంది. దీనిని వ్యతిరేకిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మక్కువ మండలంలోని దుగ్గేరు ప్రాంతంలో 2 వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం వివాదాస్పదమవుతోంది. మెస్సర్స్ చింతా గ్రీన్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తూ జిఒ 84ని జారీ చేసింది. ఇప్పటికే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధమయ్యారు. సమీపంలోని వెంగళరాయ సాగర్ రిజర్వాయర్, తోటపల్లి రిజర్వాయర్ నుంచి 24 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సరఫరా చేయాలని నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విఆర్ఎస్, తోటపల్లి రిజర్వాయర్ల ద్వారా వాటి పరిధిలోని ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రెండు ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు రైతులు, పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో నిరాశ్రయులయ్యే గిరిజన రైతులను ప్రభుత్వం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గిరిజనులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన టిడిపి నాయకులు, రైతులు

మంత్రి సంధ్యారాణి సన్నాయి నొక్కులు

దుగ్గేరు ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యాన నాయకులు, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను గౌరవిస్తామని ఆమె సన్నాయి నొక్కులు నొక్కడం చర్చనీయాంశమైంది. గతంలో నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో ఏకపక్షంగా ఆమోదం తెలిపి ఇప్పుడేమో ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తామని చెప్పడం మంత్రి ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజన సంఘాల అభిప్రాయాలను గాని, ఈ ప్రాంత గిరిజనుల, రైతుల అభిప్రాయాలను గాని ఇంతవరకూ ప్రభుత్వం తీసుకోలేదు. ఒకవైపు పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసి మరోవైపు ప్రజల అభ్యంతరాలు గౌరవిస్తూ తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పడం ద్వంద్వ నీతికి అద్దం పడుతోందని చర్చ జరుగుతోంది.

మంత్రి ద్వంద్వ వైఖరి మానుకోవాలి

రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి భాగస్వామి. గత నెల 10న జరిగిన మంత్రివర్గ సమావేశంలో దుగ్గేరు ప్రాంతంలో 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. విఆర్ఎస్, తోటపల్లి రిజర్వాయర్ల నుంచి 24 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టుకు అనుమతి మంజూరు చేసేముందు ప్రజల అభిప్రాయాలను ఎందుకు తీసుకోలేదు.? ప్రజాభిప్రాయాలు తెలుసుకోకుండా పవర్ ప్రాజెక్టు మంజూరు చేసి ఇప్పుడు గౌరవిస్తామని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. దుగ్గేరు ప్రాంత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పవర్ ప్రాజెక్టును అడ్డుకుంటామని మంత్రి సంధ్యారాణి స్పష్టంగా చెప్పాలి. అంతే కానీ సన్నాయి నొక్కులు నొక్కడం సరైన విధానం కాదు.

– కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

టెట్ నుంచి మినహాయించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి పూర్తిగా వెసులుబాటు కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు.. ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఆ ఫెడరేషన్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010 సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారికి టెట్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. దీని కోసం సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు తగిన విద్యార్హతలతో డిఎస్‌సి పరీక్ష , ఇంటర్వ్యూల ద్వారా ఎంపికై దశాబ్దాల తరబడి ఉపాధ్యాయ వృత్తి నిర్వహిస్తున్న వారిని ఇప్పుడు మరలా టెట్ పరీక్ష రాయాలనడం సరికాదని ఆయన చెప్పారు. విద్యాహక్కు చట్టంలో అవసరమైతే దీనిపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో సవరణ తేవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు యుటిఎఫ్ పోరాట కార్యక్రమాల్ని చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 20 నుంచి 27 తేదీ మధ్యలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు చట్ట సవరణ చేసేలా ప్రయత్నించాలని వినతి పత్రాలు అందిస్తున్నామన్నారు. డిసెంబరులో డివిజన్, జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాల్ని నిర్వహిస్తామని తెలిపారు. సుప్రీంకోర్టులో ఈపాటికి యుటిఎఫ్ భాగస్వామ్యంగా ఉన్న అఖిలభారత సంస్థ అయిన ఎస్‌టిఎఫ్‌ఐ ద్వారా రివ్యూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పిటిషన్లు వేశాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్లు వేసి లక్షలాదిమంది ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా టెట్ మినహాయింపు పొందేలా చూడాలని కోరారు. జనవరి 29న టెట్‌తోపాటు అనేక విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై ఎస్‌టిఎఫ్‌ఐ ఆధ్వర్యాన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ ప్రభాకర రెడ్డి

అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-సాలూరు

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. సాలూరు మండలం పెదబోరబందలో బుధవారం జరిగిన రీసర్వే గ్రామసభలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పేరున ఉన్న భూమిని పైసా ఖర్చు లేకుండా సమగ్ర వివరాలు, నిర్దిష్టమైన కొలతలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో రెవెన్యూ రికార్డుల్లో భూవివరాలు సక్రమంగా లేనందున, క్రయ, విక్రయ సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కోవలసి వచ్చిందని గుర్తుచేశారు. చట్ట ప్రకారంగా సాగు చేసుకునే భూమికి సంబంధించిన రికార్డు రైతుల వద్ద ఉండాలని, అందుకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉండాలని అన్నారు. తద్వారా ఆ భూమిపై సర్వ హక్కులు కలిగి ఉంటారని, ఈ విషయాన్ని అందరూ గుర్తెరగాలని అన్నారు.

గతంలో సరిహద్దు రాళ్లు ఉండేవని, వాటిని తొలగించి ఆక్రమణ జరిగేందుకు అవకాశం ఉండేదని చెప్పారు. ప్రస్తుతం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారని, దీని ద్వారా సరిహద్దు రాళ్లు లేనప్పటికీ కచ్చితత్వంతో కూడిన భూవివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని తెలిపారు. రీసర్వే తర్వాత రైతులకు వారి భూమిపై పూర్తి, శాశ్వత హక్కులు లభిస్తాయని, కొత్తగా జారీ చేయబోయే పట్టాదారు పాసుపుస్తకాలతో భూమి క్రయ విక్రయాలు, బ్యాంకు రుణాలు సులభంగా పొందవచ్చని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అందరి భూములకు రీసర్వే పారదర్శకంగా చేపట్టినట్లు తెలిపారు. ఇందులో కూడా ఏమైనా లోపాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని పునఃపరిశీలించి సరిచేయాలని సర్వే అధికారిని ఆదేశించారు. సర్వే, భూరికార్డుల అధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 814 మంది రైతుల భూమిని పూర్తిగా సర్వేచేశామన్నారు. వెబ్ ల్యాండ్ ప్రకారంగా 1,529.70 ఎకరాలు ఉండగా, రీసర్వే అనంతరం 1,513.5 ఎకరాలుగా తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1,22,260 మంది రైతులకు
రూ.83.32 కోట్ల లబ్ధి

'అన్నదాత సుఖీభవ' చెక్కు అందజేసిన మంత్రి సంధ్యారాణి



'అన్నదాత సుఖీభవ' చెక్కు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

జిల్లాలో 1,22,260 మంది రైతుల ఖాతాల్లో రూ.83.32 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేసినట్లు మంత్రి సంధ్యారాణి తెలిపారు. బుధవారం పాచిపెంట మండలంలో అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నమూనా చెక్కును మంత్రి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అక్కడ బటన్ నొక్కగానే ఇక్కడ రైతుల ఖాతాలలో డబ్బులు పడిపోయాయని అన్నారు. కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, ఎఎంసి చైర్మన్ ఎం.సూర్యనారాయణ. టిడిపి మండల అధ్యక్షులు గూడెపు యుగంధర్, నిమ్మాది చిట్టి, ఆముదాల పరమేష్, పూసర్ల నర్సింగరావు, మాతల బలరాం, పి.ఉమామహేశ్వరరావు, ఎంపిపి బి.ప్రమీల, ఎఒ కె.తిరుపతిరావు, ఎంపిడిఒ బివిజె పాత్రో, తహశీల్దార్ డి.రవి పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ రెండో విడత చెక్కును ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ రైతులకు అందజేశారు. నియోజకవర్గంలో 33,107 మంది రైతులకు గాను రూ.22.75 కోట్లు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. గతేడాది ధాన్యం కొనుగోలు విషయంలో రవాణా, లేబర్ ఛార్జీ, గోనె సంచులు డబ్బులు నాయకుడి జేబులోకెళ్లాయని, వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పడాల భూదేవి, పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, గంట సతీష్, కె.అప్పలనాయుడు, గండి రామినాయుడు, చింత ఉమామహేశ్వరరావు, జంపు చంద్రశేఖర్, తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, ఎంపిడిఒ బి.వెంకటరమణ, వ్యవసాయ శాఖ ఎడి కే రత్నకుమారి, ఎఒ సౌజన్య పాల్గొన్నారు.

కురుపాం : అన్నదాత సుఖీభవ నిధుల చెక్కును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో 39,084 మంది రైతులకు గాను రూ.26.94 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




కురుపాం, వీరఘట్టంలో 'అన్నదాత సుఖీభవ' చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు జగదీశ్వరి, జయకృష్ణ

తోటపల్లిలో సెయిలింగ్ యూనిట్!

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రభుత్వ సహకారంతో తోటపల్లి ప్రాంతంలో సెయిలింగ్ యూనిట్ నడిపే ఉద్దేశం ఉన్నట్లు ఆస్ట్రేలియాకు చెందిన ఇంటర్నేషనల్ హంస సెయిలింగ్ బోట్స్ వ్యవస్థాపకులు క్రిస్ మిచెల్ తెలిపారు. జిల్లాలోని జంఝావతి, తోటపల్లి ప్రాజెక్టులను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్ మిచెల్‌ను జట్టు ట్రస్టు నిర్వాహకులు డొల్లు పారినాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు వి వి అప్పలాచార్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సెయిలింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలోని చిన్నారులకు శిక్షణ ఇచ్చే ఆలోచన ఉన్నట్లు సెయిలింగ్ ఇంటర్నేషనల్ రేస్ అధికారి తిమిటి శ్రీకాంత్ చతుర్వేది తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బుధవారం అధికారులకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకర్రావు, టి.రవి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సబ్బులు ,నూనెలు, చెప్పులు, బట్టలు ఇవ్వడం లేదన్నారు. పండగకు కార్మికులకు జీతాలు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, శ్రీను, పోలా రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

వినతి అందిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు బంటు దాసు, తదితరులు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు కోరారు. బుధవారం ఆయన ఆధ్వర్యాన రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తుపాను కారణంగా దెబ్బతిన్న పంటల నష్టాన్ని సరిగ్గా అంచనా వేయలేదన్నారు. ఇంతవరకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేదని చెప్పారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ఎఎంసి అభివృద్ధికి సహకరించాలి

మాట్లాడుతున్న ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి

ప్రజాశక్తి - కురుపాం

ఎఎంసి అభివృద్ధికి డైరెక్టర్లు, సిబ్బంది అందరూ సహకరించాలని చైర్‌పర్సన్ కద్రక కళావతి కోరారు. బుధవారం కురుపాం ఎఎంసి కార్యాలయం వద్ద నూతన కమిటీతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎంసి ద్వారా రైతులకు సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. పరిసరాల్లో మౌలిక వసతులు, ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేద్దామన్నారు. సమావేశంలో ఎఎంసి వైస్ చైర్‌పర్సన్ గార గౌరి, పిఎసిఎస్ అధ్యక్షులు డొల్లు కిశోర్ కుమార్, ఎఎంసి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన యువత
ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన యువత చిన్న పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ ఆకాంక్షించారు. బుధవారం సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన యువత, విడివికె, ఎస్‌హెచ్‌జి సభ్యులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఐటిడిఎ ద్వారా ఇస్తున్న జీవనోపాధి, స్వయం ఉపాధి పథకాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. సరైన ప్రణాళికలతో ముందుకు సాగితే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. శ్రీకాకుళం డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన యువతకు ప్రభుత్వం ఇచ్చే పథకాలు, బ్యాంకులిచ్చే రుణాలపై ఇటువంటి వర్క్ షాపులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చే రుణాలకు డిఆర్‌డిఎ ద్వారా పూర్తి సహకారం అందిస్తామన్నారు. పార్వతీపురం డిఆర్‌డిఎ పీడీ సుధారాణి మాట్లాడుతూ వ్యాపారంపై పూర్తి అవగాహన ఉంటేనే ముందుకు కొనసాగగలమని సూచించారు.

ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఎల్‌డిఎం ఎం.విజయ్ స్వరూప్, శ్రీకాకుళం ఎల్‌డిఎం పి.శ్రీనివాసరావు, ఐటిడిఎ ఎపిఒ ఎస్.వి.గణేష్, ఇండస్ట్రియల్ అధికారులు రఘునాథ్, దిలీప్ కుమార్, డిఆర్‌డిఎ ఎజిఎంలు, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసరావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, వెలుగు డిపిఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్

ర్యాలీలో పాల్గొన్న ఎమ్‌పి సత్యనారాయణ, ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్, ఎస్‌పి, తదితరులు

దేశ ఐక్యతను చాటిన పటేల్

ఎమ్‌పి సత్యనారాయణ

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

దేశ ఐక్యతను ప్రపంచ దేశాలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చాటిచెప్పారని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ తెలిపారు. సర్దార్ @ 150 ఐక్యత పాదయాత్రను బుధవారం పార్వతీపురంలో నిర్వహించారు. ఆర్‌సిఎం స్కూల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సాగింది. ఈ ర్యాలీలో ఎమ్‌పితోపాటు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, ఎస్‌పి ఎస్.వి.మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ పటేల్ స్ఫూర్తితో కుల మత, భాషా బేధం లేకుండా అందరూ కలిసి మెలిసి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల నృత్య కళా ప్రదర్శనలను ఇతర అతిథులతో కలిసి ఎమ్‌పి తిలకించారు. అనంతరం ఆత్మ నిర్భర భారత్ ప్రతిజ్ఞను యువతతో చేయించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, యువత, పోలీసులు, అధికారులు, పౌరులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పాఠశాలల్లో 'ముస్తాబు'

ప్రజాశక్తి-బలిజిపేట

ముస్తాబు కార్యక్రమంతో విద్యార్థుల్లో మంచిమార్పు కనిపిస్తోందని, అన్ని పాఠశాలల్లోనూ దీనిని పక్కాగా అమలు చేయాలని ఎంఇఒ సామల సింహాచలం సూచించారు. బుధవారం బలిజిపేట మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులలో మానసిక వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించేందుకు దోహద పడుతుందన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద టర్న్ తీసుకుంటున్న బస్సు

ఎట్టకేలకు బస్టాండ్ ఆవరణలోకి బస్సులు

ప్రజాశక్తి-మక్కువ

ఎన్నో ఏళ్లుగా బస్టాండ్ నిర్మించి వదిలేసినప్పటికీ ఆ ప్రాంతంలో బుధవారం ఆర్‌టిసి బస్సులు కనిపించడం చూపరులకు వింతగా అనిపిస్తుంది. ఇటీవల మక్కువ మేజర్ పంచాయతీలో ఇఒ బెహరా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాలను కూడా శుభ్రం చేశారు. దీంతో కాంప్లెక్స్ ఆవరణలో బస్సులు తిప్పుకునేందుకు అనువుగా ఏర్పడింది. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

సబ్‌స్టేషన్ల పరిశీలన

ప్రజాశక్తి-కురుపాం, గుమ్మలక్ష్మీపురం

కురుపాం, గుమ్మలక్ష్మీపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్లను ఎస్ఇ మల్లికార్జునరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రాంతంలో విద్యుత్ మెరుగుదలకు మరింత కృషి చేయాలని అన్నారు. పిఎం సూర్యఘర్ పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఎఇలు కోటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులకు మద్దతుధర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గిరిజనులు అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ సిబ్బందికి నేరుగా విక్రయించి, మద్దతుధర పొందాలని జిసిఎంఎస్ పార్వతీపురం బ్రాంచ్ మేనేజర్ ఎం.సాంబశివరావు కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం మండలం బీరుపాడు గ్రామంలో అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్లో ప్రయివేటు వర్తకులకు అమ్మడం వల్ల గిట్టుబాటు ధర లభించక గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు. గిరిజనులు తాము సేకరించిన అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీకి నేరుగా తేవాలని సూచించారు. కార్యక్రమంలో బీరుపాడు సర్పంచ్ కిల్లక కళావతి, జిసిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కారులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దోనుబాయి జంక్షన్ వద్ద ఎస్ఐ వై.అమ్మనరావు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణంగా పరిశీలించారు. వాహనాలు ఎక్కడి నుండి వస్తున్నాయి? ఎక్కడికి వెళ్తున్నాయో ఆరా తీశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు యుగంధర్

ప్రజాశక్తి-కొమరాడ

యుగంధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

వాలీ బాల్ అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి తిమ్మక యుగంధర్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గురుకులంలో యుగంధర్‌ను ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తాచాటిన మేనక

ప్రజాశక్తి-మక్కువ

ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ఎ.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బుజ్జా మేనక సత్తాచాటింది. దీంతో ఈ నెల 22 నుంచి నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మేనక ఎంపికైనట్లు హెచ్ఎం ఇ.దేవి తెలిపారు. బుధవారం మేనకు హెచ్ఎంతోపాటు పీడీ ప్రదీప్, పిఇటి పరశురామ్, సిబ్బంది అభినందించారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళలు ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం నగరంలోని సాయినాథ్ కాలనీలో నిర్వహించిన భగవాన్ సత్యసాయిబాబా శతవర్ష (100వ) వేడుకలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వంద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఎంపిపి మామిడి అప్పలనాయుడు, ఎంపిడిఒ గంటా వెంకటరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పరిశుభ్రం పచ్చనైన గ్రామ పంచాయతీలు థీమ్ 5 కార్యక్రమంలో భాగంగా గ్రామ స్వయం ఉపాధి గ్రూపులకు, విఒలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా పచ్చదనంగా ఎలా తయారు చేసుకోవాలి, తడి పొడి చెత్తను ఏ విధంగా వేరు చేసుకుని చెత్త బండికి ఇవ్వాలో వివరించారు. ఎంపిపి అప్పలనాయుడు మాట్లాడుతూ తడి,పొడి చెత్తపై మహిళలకు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు కార్యక్రమంలో ఎఒ మోహన్, ఎపిఎం పలక స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింట్లో ముందుండాలి

విజయనగరం కోట : మహిళలు అన్నింటా ముందుండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. లక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సహాయాధికారి జ్యోతి, గ్రంథాలయ సంఘం అధ్యక్షులు అబ్దుల్ రావూఫ్, రిటైర్డ్ గ్రంథాలయాధికారి రామభద్రరాజు, తిరుమల కాలేజి ప్రిన్సిపల్ జ్యోష్న , విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక గాజుల రేగ శాఖ గ్రంథాలయం అధికారి ఎం. లక్ష్మణరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

అధిక గిరాకీ పంటలపై దృష్టి పెట్టాలి

వ్యవసాయ రంగంలో జిల్లా ముందంజలో ఉండాలి : కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి-సాలూరు

పత్తి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో అధిక గిరాకీ, లాభాలు ఉండే పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం సాలూరు మండలం పెదబోరబందలో రైతులు వేసిన పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పత్తితో పాటు ఇతర వాణిజ్య పంటలు, ఉద్యాన పంటల సాగును పెంచడం ద్వారా ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవచ్చని అన్నారు. అధునాతన సాగు పద్ధతులు, సాంకేతికత, నూతన వంగడాల ఎంపిక, నాణ్యమైన విత్తనాల వినియోగం తప్పనిసరి అని సూచించారు. మెరుగైన దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన ఆధునిక సాగు పద్ధతుల గురించి వ్యవసాయాధికారుల నుంచి సలహాలు తీసుకోవాలని తెలిపారు. పంటలకు వచ్చే తెగుళ్ళను గుర్తించి, సమయానికి సరైన మందులు వినియోగించడంపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల బీమా, వడ్డీ లేని రుణాలు వంటి పథకాల గురించి వివరించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా బలపడాలని సూచించారు. పత్తికి మంచి ధర రావాలంటే, తడి లేకుండా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, నాణ్యత విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు గ్రామాల స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేసి, రైతులకు క్షేత్ర స్థాయిలో సలహాలు, సూచనలు అందించాలని, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అధిక దిగుబడులు సాధించి, జిల్లాను వ్యవసాయ రంగంలో ముందుంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

కురుపాంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తక్షణమే ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాల కురుపాంలో ఏర్పాటు చేస్తే సమీప జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. ప్రస్తుతం గిరిజన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నారని, దీంతో ఆ కుటుంబాలపై ఆర్థిక భారం కూడా పెరుగుతుందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కూడా ఈ అంశంపై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

సిఐటియు జాతీయ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కో కన్వీనర్ బి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా మహాసభ మొదటిసారిగా విశాఖపట్నంలో జరుగుతుందని చెప్పారు. మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చర్చిస్తారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వంతో ఐక్యత పోరాట నినాదంతో పుట్టి పెరిగిన సిఐటియు ఆలిండియా మహాసభకు ఒక ప్రత్యేకత ఉందన్నారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి, కట్టుబానిసలుగా మార్చడానికి పూనుకున్నాయని విమర్శించారు. ఎనిమిది గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేయడం కార్మికులను దగా చేయడమేనని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని, మరొకవైపు నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిరంతరం పెంచుతూ, విద్య, వైద్యం పూర్తిగా వ్యాపారం చేశారని తెలిపారు. ఇలాంటి తరుణంలో కార్మిక సమస్యలపై పోరాడుతున్న సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలు నాయకులు గొర్లి వెంకటరమణ, రెడ్డి వేణు, బి.వెంకటరమణ, జి.వెంకటరమణ, బొంకుర సూరిబాబు, కొల్లి సాంబమూర్తి, రామారావు, గౌరమ్మ, సావిత్రమ్మ, గోవిందా, హరినాథ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలి

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిమాండ్‌చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం పట్టణంలో నెహ్రూ మార్కెట్ ఎదురుగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి, మద్దతు తెలియజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అనుబంధ విభాగాల నాయకులు గొర్లి మాధవరావు, సువ్వాడ లావణ్య, సరివిశెట్టి శ్రీనివాసరావు, బంకపల్లి వాసుదేవరావు, దేవుపల్లి నాగరాజు, పాత గౌరీశంకరరావు, కాగాన ప్రకాశ్, కోల సుధాకర్, ఆకుల శ్రీనివాసరావు, గోగు గాయత్రి, కోరాడ చిట్టి, సర్పంచ్ పెండ రమణ, నాయకులు చింతాడ శైలజ, అలజంగి జితేంద్ర, చింతాడ రాజేష్, సువ్వాడ శ్రీనివాసరావు, బొండపల్లి చంటి, చెరుకుబిల్లి వినోద్, జి.శంకరరావు, బొంగు సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

కారు ఢీకొని ల్యాబ్ టెక్నీషియన్ మృతి

ప్రమాదానికి కారణమైన కారు, హరిప్రసాద్ (ఫైల్)

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మ గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారు జామున కారు ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. స్థానికుల కథనం ప్రకారం.. గుమ్మ గ్రామానికి చెందిన గౌడ్ హరిప్రసాద్ (38) అయ్యప్పస్వామి మాలధారణలో ఉన్నారు. బుధవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆయన్ను రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేష్ కారు ఢీకొంది. దీంతో హరిప్రసాద్ అక్కడికక్కడే మరణించారు. ఆ సమయంలో మల్లేష్ కారు నడుపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలంలో కారు విడిచిపెట్టి వెళ్లిపోయారు. హరిప్రసాద్ నీలకంఠాపురం పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హరిప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ పి.నారాయణరావు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే విచారం

హరి ప్రసాద్ కుటుంబాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భద్రగిరి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. హరి ప్రసాద్ మృతి పట్ల విచారం వ్యక్తంచేశారు.

మాజీ డిప్యూటీ సిఎం పరామర్శ

హరి ప్రసాద్ కుటుంబసభ్యులను మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి నాయకులు షేక్ ఆదిల్, ఐ.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మహిళా దినోత్సవంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ డి. సుకన్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతంపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, శాఖా గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు, సహాయకులు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలిజిపేట : బలిజిపేట శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఖోఖో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు.

సీతంపేట.. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

రస్తాకుంటుబాయిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు కరస్పాండెంట్ ఎన్.శ్రీనివాస్, ప్రిన్సిపల్ కె.శ్రీరామ్మూర్తి నాయుడు ఆధ్వర్యాన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై కెవికె పిఒ డాక్టర్ ధ్రువ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వంగడాలు, దిగుబడి, సేంద్రీయ వ్యవసాయంపై వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పేదలు సాగుచేస్తున్న భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు

సాగు భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-సీతానగరం

పేదల సాగుభూములకు రక్షణ కల్పించి, సాగు హక్కులు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఏనుగుల జోన్ ప్రాంతమైన అప్పయ్యపేట కొండపై పేదలు సాగుచేస్తున్న భూములను బుధవారం సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పరిశీలించారు. అనంతరం ఫారెస్ట్ రేంజర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, దళితులు, గిరిజనులు ఎన్నో ఏళ్లుగా అక్కడ సాగు చేసుకుని, జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గిరిజనులకు అటవీ హక్కు చట్ట ప్రకారం ఆర్ఒఎఫ్ఆర్, మిగిలిన వారికి సాగు పట్టాలు గతంలో ఇచ్చారని గుర్తుచేశారు. అలాంటి కొండ ప్రాంతంలో అటవీ అధికారులు ఏనుగుల జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వారంతా ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి హామీనిచ్చినా, ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. ట్రెంచులు తవ్వడం వల్ల పేదల భూముల్లో ఫల సాయం వచ్చే చెట్లు తొలగించడంతో నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్ లోపలికి వెళ్లొద్దని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. భూములు సాగు చేస్తున్న వారికి అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు గవర వెంకటరమణ, రాయిపల్లి రాము, పరశురాము, రాము పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్ ద్వారా గ్రామాలను శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మనోహర్ పాల్గొన్నారు.

కొమరాడ : పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుచేసిన శిక్షణలో ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి డి.లక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ.. మాట్లాడుతున్న ఎంపిపి శ్యామల

బలిజిపేట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ శ్రీహరి ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. గ్రామంలో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

సీతంపేట : క్లీన్ అండ్ గ్రీన్‌పై మండలంలోని పంచాయతీ సర్పంచులకు, ఉప సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ బిబి మిశ్రో మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిశుభ్రంగా ఉండాలని, అందుకు సర్పంచులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య బాధ్యత ఉపాధ్యాయులదే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

సిక్ విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ పద్మావతి సూచించారు. మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులను పరామర్శించారు. హెచ్ఎం వేణుగోపాల్‌తో మాట్లాడుతూ మలేరియా, చికెన్‌గున్యా, టీబీ, టైఫాయిడ్, ఎనిమియా, లెప్రసీ కేసులు గురించి పిల్లలకు అవగాహన కల్పించాలని అన్నారు.

హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు ఉదయం, రాత్రి మాత్రలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి యమున, ఆరోగ్య కార్యకర్త రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-సీతానగరం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

మండలంలోని జోగంపేట గురుకుల పాఠశాలను ఎంపిడిఒ ప్రసాద్ బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ వి.సన్యాసినాయుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.